క్లుప్తంగా

లేగదూడల ప్రదర్శన


శంఖవరంలో ప్రదర్శనకు వచ్చిన లేగ దూడలు

శంఖవరం: పశువుల పెంపకంతో అధిక లాభాలు పొందవచ్చని పశుసంవర్ధకశాఖ జిల్లా సహాయ సంచాలకులు పీతల మనోజ్‌కుమార్ అన్నారు. స్థానిక ప్రభుత్వ పశు వైద్యాసుపత్రిలో సోమవారం లేగదూడల ప్రదర్శన నిర్వహించారు. పశువుల్లో గర్భకోశ వ్యాధుల నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మనోజ్‌కుమార్ మాట్లాడుతూ లింగ నిర్ధారణ వీర్యం ద్వారా దృఢమైన దూడలు జనిస్తాయన్నారు. పాడి రైతులకు సబ్సిడీపై గడ్డి విత్తనాలు అందిస్తున్నట్టు తెలిపారు. అనంతరం పాడి రైతులకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశు వైద్యులు కె.ప్రసాద్, కె.లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఆన్‌లైన్ కోర్సు

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య విశ్వవిద్యాలయంలో నిర్వహించిన ఎఫ్‌పీజీఏతో డిజిటల్ హార్డ్‌వేర్ ఇంజినీరింగ్ అనే ఆన్‌లైన్ ప్రామాణికత కోర్సు సోమవారంతో ముగిసినట్టు డిప్యూటీ ప్రో చాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆదిత్య లెర్నింగ్ అకాడమీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యాన నిర్వహించిన ఈ కోర్సులో సాంకేతికత పరిచయం, డిజిటల్ డిజైన్ మూలసూత్రాలు, తదితర అంశాలపై అవగాహన కల్పించినట్టు తెలిపారు. కార్యక్రమంలో వైస్ చాన్సలర్ ఎంబీ శ్రీనివాస్, ప్రో వైస్ చాన్సలర్ ఎస్.రమాశ్రీ తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యంపై కేసు


చంద్రకళ (ఫైల్)

తుని: పాయకరావుపేట మండలం మాసాయిపేటకు చెందిన వివాహిత విప్పల చంద్రకళ అదృశ్యంపై తుని జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేశారని ఎస్సై జి.శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. విశాఖపట్టణానికి చెందిన చంద్రకళ గత నెల 26న ద్వారాసామ్ము తీసుకోవడానికి తల్లి ఇంటికి వచ్చింది. తిరిగి విశాఖపట్నం వెళ్లడానికి ఈ నెల 1న తుని రైల్వేస్టేషన్‌లో ఒకటో నంబర్ ప్లాట్ ఫాంకు వచ్చి వేరే వ్యక్తి దగ్గర సెల్ ఫోన్ తీసుకుని తన చెల్లి గారికి ఫోన్ చేసిందన్నారు. విశాఖపట్నం రాలేదని బంధువులు చంద్రకళ భర్త సూరిబాబుకు చెప్పారు. మాసాయిపేట, తుని ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆమె భర్త సూరిబాబు తుని జీఆర్పీ పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన ఎస్సై శ్రీనివాసరావు దర్యాప్తు చేస్తున్నామని, చంద్రకళ వివరాలు తెలిస్తే తుని జీఆర్పీ పోలీసులకు తెలియపరచాలని కోరారు.

పన్నుల వసూలు వేగవంతం చేయాలి


నీలాద్రిరావుపేటలో పంచాయతీ సిబ్బందికి సూచనలిస్తున్న డీఎల్పీఓ బాలామణి

గండేపల్లి: గ్రామాల్లో పన్నులు తక్కువ వసూల్ చేసిన సిబ్బందికి మెమోలు తప్పనిసరి అని పెద్దాపురం డీఎల్పీఓ ఎం.బాలామణి హెచ్చరించారు. మండలంలోని నీలాద్రిరావుపేట చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద సోమవారం పంచాయతీ కార్యదర్శులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పన్ను వసూళ్లను వేగవంతం చేయాలన్నారు. ఈ నెలాఖరకు పన్ను వసూళ్లు పూర్తి చేయాలని, లేని పక్షంలో చర్యలు తప్పవన్నారు. పారిశుద్ధ్యం మెరుగుపడాలని, హైవే వెంబడి గల గ్రామ శివార్లలో రోడ్డుకు ఇరువైపులా చెత్తను తొలగించాలన్నారు. అనంతరం యల్లమిల్లిలో సంపద కేంద్రాన్ని పరిశీలించారు.

పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గం ఎన్నిక

తుని రూరల్: తుని పట్టణ, మండల పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గం అధ్యక్ష, కార్యదర్శులుగా పాస్టర్ జి.ఆనంద్ కుమార్, జేఎస్.జాషువా ఎన్నికయ్యారు. వల్లూరులోని సీఐఎం చర్చ్‌లో సోమవారం సంఘ గౌరవ అధ్యక్షుడు బిషప్ ఎస్.సాల్మన్‌రాజు, పాస్టర్లు పి.ఫిలిప్, సీహెచ్ లిమ్మా, ఎం.డానియల్ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. సంఘ కోశాధికారిగా పి.సతీష్ కుమార్, ఉపాధ్యక్షులుగా పి.ఎలిషారాజు, ఉప కార్యదర్శిగా ఎం.గాబ్రియేలు, ఉపకోశాధికారిగా పి.జాషువమల్ల ఎన్నికయ్యారు. టి.ప్రవీణ్ కుమార్, వి.ప్రేమానందం, పి.సుదర్శన్ కుమార్, పి.జాషువ, టి.శాంతి కుమారి, టి.రవికుమార్‌లను కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని పాస్టర్లు ఘనంగా సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు.

పనుల పరిశీలన

సామర్లకోట: స్థానిక స్టేషన్ సెంటర్‌లో నిర్మిస్తున్న గడియారం స్తంభం పనులను మున్సిపల్ ఏఈ ఎం.రమేష్‌బాబు సోమవారం పరిశీలించారు. ఇప్పటికే గడియారం ఏర్పాటు చేయడంతో సోమవారం గ్రిల్స్ ఏర్పాటు పనులు పరిశీలించారు. ఈ మేరకు ఆ పనులను ఏఈ పరిశీలించి కాంట్రాక్టర్‌కు పలు సూచనలు ఇచ్చారు. ఈ నెలలో ప్రారంభించేలా గడియారం స్తంభాన్ని పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు.

కాలువ తెచ్చిన కష్టాలు !

- పోలవరం కాలువ నిర్మాణంతో తాళ్లూరులో రహదారి సమస్య
- బ్రిడ్జి నిర్మించాలని కోరుతున్న గ్రామస్తులు, రైతులు
- స్పష్టమైన హామీ ఇవ్వని అధికారులు
- ఆందోళనకు సిద్ధమవుతున్న ప్రజలు


తాళ్లూరుకు-కాలనీకి మధ్య ప్రధాన రహదారి, బ్రిడ్జి నిర్మించాల్సిన ప్రాంతం


పోలవరం కాలువ అవతల ఉన్న జగన్న కాలనీలో ఇళ్లు

తుని రూరల్: పోలవరం ఎడమ ప్రధాన కాలువ ఐదో ప్యాకేజీలో నిర్మాణ పనులు పూర్తి చేయడమే తమ విధిగా భావిస్తున్న కాంట్రాక్టర్ తాళ్లూరు గ్రామస్తుల రహదారి సమస్యపై దృష్టి సారించడం లేదు. ప్రస్తుతం ఉన్న రహదారి కాలువ తవ్వకంలో ధ్వంసం కానుంది. దీంతో పంట పొలాలకు, పశువుల పాకలకు, కాలనీలో ఇళ్లకు, గుళ్లకు వెళ్లే మార్గం కనుమరుగవుతుంది. కాలువ తవ్వకం, సీసీ లైనింగ్ పనులు పూర్తయితే తమకు రహదారి సమస్య తలెత్తుతుందన్న భావన గ్రామస్తులు, రైతుల్లో నెలకొంది. ఇప్పుడు కాకపోతే మరెప్పుడూ రహదారి మార్గం ఉండదని గ్రామస్తులు, రైతులు భావిస్తున్నారు. భూసేకరణలో 300 ఎకరాల పంట భూములను, రెండు సాగునీటి చెరువులను కోల్పోయిన రైతులు తమకు జీవనాధారంగా ఉన్న భూములను సాగు చేసుకోవాలంటే రహదారి మార్గం ఉండాలి. దీంతో తాము నష్టపోయినా మా తర్వాత తరాలు నష్టపోకూడదన్న ఆలోచన కాలువ తవ్వకం పనులు అడ్డుకునేందుకు దారి తీసింది. అధికారుల నుంచి స్పష్టమైన హామీ లభించకపోవడంతో రైతులు ఉద్యమానికి సిద్ధమవుతున్నారు.

900 ఎకరాల పంట భూములు

తాళ్లూరు గ్రామంలో 800 గృహాల్లో 3085 మంది ఉంటున్నారు. గ్రామం పరిధిలో 900 ఎకరాల పంట భూములు ఉన్నాయి. ఈ భూముల్లోకి వెళ్లేందుకు ప్రధాన రహదారులు రెండున్నాయి. అందులో ఒకటి తాళ్లూరు నుంచి కుమ్మరిలోవ వెళ్లే మార్గం కాగా మరోకటి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వైపు నుంచి లక్ష్మీనారాయణస్వామి గుడి, జగనన్న కాలనీ మార్గం. 2014–19 మధ్య పనులు చేపట్టిన పీఎస్‌కే కాంట్రాక్ట్ సంస్థ మొదట మార్గంలో స్లూయిజ్ కం రోడ్డు (బ్రిడ్జి) నిర్మించింది. రెండో మార్గం వద్ద కాలువ తవ్వకం పనులు చేపట్టలేదు. దీంతో కాంట్రాక్టర్‌కు, గ్రామస్తులకు ఎటువంటి ఆటంకాలు కలగలేదు. ఇప్పుడు కాంట్రాక్ట్ సంస్థ మారడం, డిసెంబర్ నెలాఖరుకు పనులు పూర్తి చేయాలన్న ఆత్రుతతో శరవేగంగా చేస్తున్న పనులు రెండో రహదారి మార్గం వద్దకు చేరుకున్నాయి.

బ్రిడ్జి నిర్మించకుండా పనులు చేస్తుండడం, రేపోమాపో రెండో రహదారి మార్గం తొలగించనుండడంతో గ్రామస్తుల్లో ఆందోళన నెలకొంది. ఈ మార్గం నుంచి కాలనీకి, 400 ఎకరాల పంట భూములకు, గ్రామ దేవత తలుపులమ్మ అమ్మవారు, శ్రీలక్ష్మీనారాయణస్వామి గుళ్లకు వెళ్లిరావలసి ఉంది. అలాగే మహాత్మా జ్యోతిరావుపూలే గురుకుల విద్యాలయం నిర్మిస్తున్నారు. రెండో రహదారి లేకపోతే కాలువ దాటుకుని వెళ్లాంటే రెండు నుంచి మూడు కిలో మీటర్లు అదనంగా ప్రయాణించాల్సి వస్తుంది. రైతులు రోజువారీ పనులకు, పంటకాలంలో ఫలసాయం తెచ్చుకునేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొవలసి ఉంటుంది.

ప్రత్యామ్నాయ మార్గాల పరిశీలన

తాళ్లూరు రైతులు, గ్రామస్తుల ఆందోళనతో అధికారుల్లో కదలిక వచ్చింది. జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ భావన, పెద్దాపురం ఆర్డీఓ శ్రీరమణ, పోలవరం ఇరిగేషన్ ఈఈ గోవిందు ఆ ప్రాంతాన్ని సందర్శించారు. ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలించారు. ఉన్నతాధికారులకు గ్రామస్తుల సమస్యలు నివేదిస్తామని చెప్పి వెళ్లిపోయారు తప్ప గ్రామస్తులకు, రైతులకు ఎటువంటి స్పష్టమైన హామీ ఇవ్వ లేదు.

వ్యవసాయ పనులకు వెళ్లకతప్పదు



వంటావార్పు, రాత్రి వేళల్లో నిద్రించేందుకు గ్రామంలోకి వస్తాం. పగలంతా పంట పొలాల్లో పనులు చేసుకుంటాం. వ్యవసాయ పనులు చేసుకునేందుకు, ఫలసాయం తెచ్చుకునేందుకు కాలువ అవతలకు వెళ్లకతప్పదు.

– తమరాన సూర్యప్రభవతి, తాళ్లూరు

బ్రిడ్జి నిర్మించాల్సిందే



గ్రామస్తులు, రైతులు, కాలనీవాసులు, విద్యార్థుల రాకపోకలకు రహదారి ముఖ్యం. కాలువ తవ్వకంతో రహదారి ధ్వంసమవుతుంది. సమస్య పరిష్కారం కోసం పోలవరం కాలువపై బ్రిడ్జి నిర్మించాల్సిందే.

– తమరాన శ్రీనివాసరావు, తాళ్లూరు

తరతరాలకు కష్టాలు



సన్న, చిన్నకారు రైతులు, వ్యవసాయేతర రోజువారీ కూలీలు తాళ్లూరు గ్రామంలో జీవిస్తున్నారు. కాలువ కోసం గ్రామస్తులు 300 ఎకరాలను భూ సేకరణలో కోల్పోయారు. బ్రిడ్జి నిర్మించకపోతే తరతరాలన్నీ రహదారి కష్టాలు పడాల్సిందే.

– సుర్ల సూరిబాబు, తాళ్లూరు

సమస్య పరిష్కరించకుంటే ఆందోళన



తాళ్లూరు గ్రామస్తులు, రైతుల రహదారి సమస్య పరిష్కరించకపోతే ఆందోళనకు వెనుకాడం. ఇప్పటికే అధికారులకు, కాంట్రాక్ట్ సంస్థలకు తమ సమస్యలు వివరించాం. మానవతా దృక్పథంతో అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించాలి.

– ఆవుగడ్డ వెంకటరమణ, తాళ్లూరు

రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరి


వీరవరంలో విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదును పరిశీలిస్తున్న ఏఓ జోకా అమృత

కిర్లంపూడి: మండలంలోని భూమి కలిగిన ప్రతి రైతూ విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పని సరిగా నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి జోకా అమృత సూచించారు. మండలంలోని వీరవరం రైతు సేవా కేంద్రంలో సోమవారం విశిష్ట సంఖ్య ఆవశ్యకతపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని అన్ని రైతుసేవా కేంద్రాల్లో సొంత భూమి గల రైతులకు ఆధార్ తరహాలో ఒక యూనిక్ ఐడీ నమోదు చేస్తారన్నారు. ఇప్పటికే మండలంలో 60 శాతం నమోదు పూర్తయ్యిందన్నారు. ఇప్పటివరకు నమోదు చేయించుకోని రైతులు సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ లింక్ అయిన మొబైల్ నంబర్ తీసుకెళ్లి ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలన్నారు. వీఏఏ పి.వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

శివాలయం వద్ద భారీ అన్నదానం

గోకవరం: స్థానిక పర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం శివాలయం) వద్ద సోమవారం భారీ అన్నదానం నిర్వహించారు. శివరాత్రి ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని ఆలయ కమిటీ, సేవకులు, అర్చకుల ఆధ్వర్యంలో ఈ అన్నదానం ఏర్పాటు చేశారు. గోకవరంతో పాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి సుమారు ఐదు వేల మంది భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. తొలుత ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

ఆర్టీసీ ఉద్యోగుల రిలే నిరాహార దీక్షలు


ఏలేశ్వరంలో రిలే నిరాహార దీక్షలు చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

ఏలేశ్వరం: స్థానిక ఆర్టీసీ డిపో డ్రైవర్‌ను అక్రమంగా సస్పెండ్ చేయడాన్ని వ్యతిరేకిస్తూ పట్టణంలో సోమవారం ఆర్టీసీ ఉద్యోగులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. జేఏసీ ఆధ్వర్యంలో డిపో గేట్ వద్ద ఉద్యోగులు ధర్నా చేసి దీక్ష ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంప్లాయిస్ యూనియన్ డిపో కార్యదర్శి యాబీఎం కుమార్ మాట్లాడుతూ స్థానిక ఆర్టీసీ డిపోకు చెందిన కండక్టర్ ఎస్వీ రమణను 1/2009 సర్కులర్‌కు విరుద్ధంగా అక్రమంగా సస్పెండ్ చేశారన్నారు. ఉద్యోగులు ఆందోళనలు చేస్తున్నా యాజమాన్యం స్పందించకపోవడం దారుణమన్నారు. ఎస్వీ రమణను విధుల్లోకి తీసుకునే వరకూ ఉద్యమం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఎంయూ డిపో కార్యదర్శి టి.త్రిమూర్తులు, ఎస్‌వీరావు, బీమన సూరిబాబు, కె.అప్పారావు, ఎస్ఎస్‌రాజు, ప్రవీణ్, అప్పయ్య, చలం, చిన్న తదితరులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబు వ్యాఖ్యలు రాజ్యాంగ విరుద్ధం

- మాజీ మంత్రి తోట నరసింహం
- కూటమి ప్రభుత్వం తీరుపై మండిపాటు


జగ్గంపేటలో సింగరమ్మతల్లి వార్షికోత్సవాల పోస్టర్‌ను విడుదల చేస్తున్న తోట నరసింహం

జగ్గంపేట: ప్రతిపక్ష పార్టీలపై సీఎం చంద్రబాబు చేస్తున్న వ్యాఖ్యలు కూటమి నేతల పైత్యానికి పరాకాష్ట అని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం అన్నారు. జగ్గంపేటలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. వైఎస్సార్ సీపీ శ్రేణులకు ఎలాంటి పనులు చేయవద్దని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బహిరంగంగా ప్రకటించడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. అధికారులకు పరోక్షంగా వైఎస్సార్ సీపీ నేతలు, ఆ పార్టీని అభిమానించే ప్రజలకు సంక్షేమ పథకాలు అందించవద్దని చెప్పడం దారుణమన్నారు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకార సమయంలో పార్టీలు, వర్గాలు, రాగద్వేషాలకు అతీతంగా అందరి సంక్షేమానికి కృషి చేస్తానని ప్రమాణం చేసిన విషయాన్ని సీఎం చంద్రబాబు మరిచిపోయినట్టు కనిపిస్తోందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా కాకుండా కూటమి నేతలకు మాత్రమే ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నారా ? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై ప్రజల నుంచి నిరసన వ్యక్తమవుతోందని తెలిపారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చమని బడ్జెట్ ద్వారా కూటమి ప్రభుత్వం తేటతెల్లం చేసిందన్నారు. కేవలం డైవర్షన్ పాలిటిక్స్ ద్వారా రాష్ట్రంలో పబ్బంగడుపుకోవడానికి కూటమి ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నేతలు గల్లా ఏడుకొండలు, తోట రాంజీ, కరుటూరి వీర్రాజు, రావుల గణేష్‌రాజా, తులా రాము తదితరులు పాల్గొన్నారు.

సింగరమ్మతల్లి మహోత్సవాల పత్రిక ఆవిష్కరణ

జగ్గంపేట మండలం మల్లిసాల శివారు సింగరమ్మ చింతవద్ద వెలిసిన సింగరమ్మతల్లి వార్షిక మహోత్సవాల పత్రికను తోట నరసింహం సోమవారం విడుదల చేశారు. సింగరమ్మతల్లి ఆలయ కమిటీ నేతలు తోట నరసింహాన్ని వార్షికోత్సవానికి ఆహ్వానించారు. ఆలయ కమిటీ సభ్యులు తొట్టిపూడి నాగేశ్వరరావు, ముంద్రు కృష్ణారావు,పి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌హెచ్‌జీల అభివృద్ధికి కృషి చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం సూర్యకుమారి

కోటనందూరు: స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని ఏపీఎం సూర్యకుమారి వీఓఏలను ఆదేశించారు. స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో సోమవారం లోకోస్ మొబైల్ యాప్‌పై వీఓఏలకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం సూర్యకుమారి మాట్లాడుతూ సంఘాలను సమర్థవంతంగా నడిపించేందుకు సంఘ కార్యకలాపాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. తరచూ సమావేశాలు ఏర్పాటు చేసి సభ్యులను చైతన్య పరచాలని సూచించారు. రుణాలు, రికవరీ, బుక్‌కీపింగ్ తదితర అంశాలపై అవగాహన పెంచుకొని సంఘాలను సక్రమంగా నడిపించాలన్నారు. టీఓటీ ట్రైనర్ నాగేశ్వరరావు, ఎంటీలు భవానీ, సుమలతలు లోకోస్ యాప్ నిర్వహణపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీసీలు దేవుడు, నాగలక్ష్మి, అకౌంటెంట్ చిన్నమ్మలు తదితరులు పాల్గొన్నారు.

గోకవరంలో కెనరా బ్యాంకు సేవలు ప్రారంభం


గోకవరంలో కెనరా బ్యాంకు బ్రాంచి ప్రారంభిస్తున్న జనరల్ మేనేజర్ విజయలక్ష్మి

గోకవరం: మండల కేంద్రమైన గోకవరంలో కెనరా బ్యాంకు బ్రాంచ్‌ని సోమవారం ప్రారంభించారు. ఆ బ్యాంకు విజయవాడ జనరల్ మేనేజర్ సీజీ విజయలక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొని బ్యాంకు సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో కెనరా బ్యాంకు ప్రభుత్వ రంగ సంస్థల్లో మూడో స్థానంలో ఉందన్నారు. ఏఐ 1 యాప్ ద్వారా వన్ ఇండియా స్థాయిలో, విదేశాల్లోనూ ఎక్కువ ప్రచారంలో ఉందన్నారు. ఖాతాదారులకు అతి తక్కువ వడ్డీకే రుణాలు అందిస్తున్నట్టు తెలిపారు. భీమవరం రీజినల్ మేనేజర్ రవిచంద్ర మాట్లాడుతూ వ్యవసాయ రుణాలు, బంగారంపై రుణాలు, ఎడ్యుకేషన్ రుణాలు, చిరు వ్యాపారస్తులు, వ్యాపార సంస్థలకు అన్ని విధాలుగా రుణాలు ఇచ్చేందుకు కెనరా బ్యాంకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని, ప్రజలు తమ శాఖ అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలని గోకవరం నూతన శాఖ బ్రాంచి మేనేజర్ శశిధర్ తెలిపారు.

భానుడి భగభగలు


ఎండ తీవ్రతకు నిర్మానుష్యంగా మారిన గోపాలపట్నం-తొండంగి ప్రధాన రహదారి

తొండంగి: వేసవి ప్రారంభంలోనే భానుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. ఉదయం 8 గంటలకే ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. గత రెండు రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు 38 డిగ్రీల వరకూ నమోదవుతున్నాయి. ఉదయం 10 గంటల నుంచే ఉక్కబోత ఉంటోంది. మండలంలోని మెట్ట, తీరప్రాంతాల్లో వేడిగాలులు వీస్తున్నాయి. ఎండతీవ్రతకు రహదారులు వాహనాలు, జన సంచారం లేక నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఇప్పుడే ఇలా ఉంటే ఏప్రిల్, మే నెలల్లో ఎండతీవ్రత ఎలా ఉంటుందోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జగ్గంపేటలో కొవ్వొత్తుల ర్యాలీ


జగ్గంపేటలో కొవ్వొత్తుల ర్యాలీ చేస్తున్న మహిళలు, ఐసీడీఎస్ సిబ్బంది

జగ్గంపేట: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జగ్గంపేటలో సోమవారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీఓ పూర్ణిమ ఆధ్వర్యంలో స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం నుంచి పోలీసు స్టేషన్, బస్టాండ్ వరకూ ర్యాలీ చేశారు. పోలీసు స్టేషన్ వద్ద మానవహారంగా ఏర్పడి మహిళలకు రక్షణ కల్పించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్, తహసీల్దార్ జేవీఆర్ రమేష్, ఎస్ఐ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ సెకండియర్ పరీక్షలు

- 22 మంది విద్యార్థులు గైర్హాజరు
- పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు


ఏలేశ్వరంలో పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు

ఏలేశ్వరం: ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం పబ్లిక్ పరీక్షలు నియోజకవర్గవ్యాప్తంగా సోమవారం ప్రశాంతంగా జరిగాయి. పరీక్ష కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయడంతో విద్యార్థులు స్వేచ్ఛగా పరీక్షలు రాశారు. మండలంలో ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 588 మంది విద్యార్థులకు గాను 22 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలైన ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 297 విద్యార్థులకు గాను 281 మంది, గురుకుల కళాశాలలో 291 మంది విద్యార్థులకు గాను 285 మంది పరీక్షలు రాశారు. పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ నిర్వహించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. ఇన్విజిలేటర్లు జంబ్లింగ్ విధానంలో విధులకు హాజరయ్యారు. పరీక్షల నిమిత్తం గురుకుల కళాశాలకు చీఫ్ సూపరింటిండెంట్‌గా కె.శారద, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్‌గా కె.సత్యనారాయణ, ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చీఫ్ సూపరింటిండెంట్‌గా కె.బాబ్జీ, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌గా పి.రామకృష్ణ వ్యవహరించారు.

కిర్లంపూడిలో 29 మంది గైర్హాజరు

కిర్లంపూడి: ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు మొదటి రోజు ప్రశాంతంగా ముగిశాయి. కిర్లంపూడి ప్రభుత్వ జూనియర్ కళాశాల, జగపతినగరం ప్రగతి జూనియర్ కళాశాలల్లో విద్యార్థులు పరీక్షలు రాశారు. సెకండియర్ తెలుగు, సంస్కృతం పరీక్షలకు 883 మంది హాజరుకావల్సి ఉండగా 854 మంది హాజరయ్యారు. 29 మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరైనట్టు సీఎస్‌లు జె.కాంచనమాల, పలివేల శివాజీ తెలిపారు.

ఓపెన్ ఇంటర్ పరీక్షలు ప్రారంభం

ఓపెన్ స్కూల్ సొసైటీ (ఏపీఓఎస్ఎస్) ఇంటర్ విద్యార్థులకు సోమవారం పరీక్షలు ప్రారంభమయ్యాయి. మండలంలోని తామరాడ, బూరుగుపూడి, గెద్దనాపల్లి ప్రభుత్వోన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల్లో జరిగిన ఇంగ్లిషు పరీక్షకు 766 మందికి 55 మంది గైర్హాజరు అయినట్టు సీఎస్‌లు వీర్రాజు, కన్నబాబు, చిన్నారావు తెలిపారు.

తక్షణమే సస్పెన్షన్ ఎత్తివేయాలి



తునిలో ర్యాలీ చేస్తున్న దళిత జేఏసీ ప్రతినిధులు

తుని: అంబేడ్కర్ మిషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, సీనియర్ దళిత ఐపీఎస్ అధికారిపై కూటమి ప్రభుత్వం అక్రమంగా విధించిన సస్పెన్షన్‌ను తక్షణమే ఎత్తివేయాలని దళిత జేఏసీ ప్రతినిధులు డిమాండు చేశారు. దళిత జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో సునీల్‌కుమార్ సస్పెన్షన్‌కు నిరసనగా శాంతియుత ర్యాలీ నిర్వహించారు. గొల్లప్పారావు సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

అనుమతులు లేని మెడికల్ షాపుపై కేసు


కోటనందూరులో మెడికల్ షాపును తనిఖీ చేస్తున్న అధికారులు

కోటనందూరు: ప్రభుత్వ అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న న్యూలైఫ్ మెడికల్ షాపుపై కేసు నమోదు చేసినట్లు డ్రగ్ ఇన్‌స్పెక్టర్ బత్తుల శ్రీనివాసు తెలిపారు. స్థానిక బస్టాండ్ సెంటర్లో కొత్తగా ఏర్పాటు చేసిన న్యూలైఫ్ మెడికల్ దుకాణంలో అనుమతులు లేకుండా మందులు విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు సోమవారం డ్రగ్ ఇనస్పెక్టర్లు బి.శ్రీనివాస్, ఎం.రమణ, ఎ.శ్రీనివాస్ దాడి చేశారు. దుకాణాన్ని తనిఖీ చేసి లైసెన్స్ లేకుండా మందులు అమ్ముతున్నట్లు గుర్తించారు. వీఆర్వో భవానీ ఆధ్వర్యంలో పంచనామ నిర్వహించి కేసు నమోదు చేశారు.